ఎంపీ మాగుంటను కలిసిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డిని ముండ్లమూరు మండల వైసీపీ నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఆయనకు పూల బోకేలు అందించి దుశ్శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రడ్ల సుబ్బమ్మ సుబ్బారెడ్డి సేవా సంఘం అధ్యక్షులు ఎర్రడ్ల చిన్న అనంతరెడ్డి, రామిరెడ్డి, మూరక వెంకటేశ్వర్‌రెడ్డి, సీతా రెడ్డి, జక్కం రాజా పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

ఒంగోలులోని ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుని మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి
- విశాలాంధ్ర, ఒంగోలు

ధర్నా జయప్రదం చేయాలి

గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమాన్‌రెడ్డి

విశాలాంధ్ర- మద్దిపాడు: గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో కందులు ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 5వ తేదీన మద్దిపాడు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం నాయకులు ధర్నాకు సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విడుదల చేయడం జరిగింది. గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం వైస్ ప్రెసిడెంట్ తుట్టెంపూడి వెంకట శేషయ్య, జాయింట్ సెక్రెటరీ రావి ఉమామహేశ్వరరావు, ఆ సంఘం నాయకులు పోకోరి వెంకటేశ్వర్లు, చెరుకూరి వాసు, నాగండ్ల వెంకటేశ్వర్లు, రావూరి వెంకటరావు, రావి వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-నాగులప్పలపాడు : మండలంలోని అమ్మనబోలు గ్రామంలో జగనన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ సీనియర్ జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వారా వీర్రాజు పాల్గొని ముందుగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు పేదలకు దుప్పట్లు పంపిణీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనం శ్రీనివాసులు తుపాకుల హరిప్రసాద్ బత్తుల మల్లికార్జున వడ్డెర సంగం అధ్యక్షులు కట్ట రాజశేఖర్ నాగులప్పలపాడు ఎస్సీ సెల్ అధ్యక్షులు మురళి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 5లక్షల చెక్కు అందజేత

విశాలాంధ్ర-కురిచేడు : మండలంలోని పడమటి వీరాయపాలెం గ్రామానికి చెందిన ఏనుగంటి సురేష్ గత నెల 15వ తేదీ రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి మృతి చెందగా ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయల చెక్కును శుక్రవారం మృతుని కుటుంబానికి మొదట పదివేల రూపాయలు అందించగా శుక్రవారం నాలుగు లక్షల 96 రూపాయలు చెక్కును మృతుని భార్యకు పంచాయతీ కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి అందించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వము నుండి ఇంత తొందరగా సహాయం అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు ఓట్ల వెంకటేశ్వర్లు సర్పంచ్ బోరి గొర్ల గోవిందు నాయకుడు పోకురి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-కనిగిరి : కొత్తగా మంజూరైన వైయస్సార్ పెన్షన్ కానుకను కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం అందించారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 7వ సచివాలయంలో కొత్తగా వచ్చిన వైఎస్సార్ పెన్షన్ పంపిణీ చేశారు. అబ్దుల్ గఫార్ పాల్గొని మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో పేద ప్రజలందరికీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోయినప్పటికీ, కరోనా కష్ట కాలంలో కూడా రూ. 2750 రూపాయల పెన్షన్ ను అందజేయడం నిజంగా అభినందనీయమని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలందరూ ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ సునీల్ కుమార్ వెల్ఫేర్ సెక్రటరీ వాసు బాబు సచివాలయం సిబ్బంది వార్డు వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో బెదిరింపులు

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద ఇర్లపాడు గ్రామానికి చెందిన అద్దంకి వరలక్ష్మి అనే ఆమెను పొలం విషయంలో చిట్టి బెదిరించారని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు అద్దంకి వరలక్ష్మి తిట్టి బెదిరించిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై కే మాధవరావు తెలియజేశారు.

కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా..అభినందనీయం

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు



విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ :

సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులు, అటవీ భూములు, దేవాదాయ భూములను సాగు చేసుకునే కౌలు రైతులకు కూడా వై.ఎస్.ఆర్.రైతు భరోసా అందించడం శుభపరిణామమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు చెప్పారు. వై.ఎస్.ఆర్.రైతు భరోసా పథకంలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత నగదు జమ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించు కొని శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం భవనం నుంచి జిల్లా ఇన్చార్జి కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులైన రైతులకు బ్యాంకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 5,802 మంది కౌలు రైతుల ఖాతాలలో రూ.4.35 కోట్ల నగదును జమ చేసినట్లు చెప్పారు. 2023 మే నుంచి ఆగస్ట్ వరకు సంభవించిన అకాల వర్షాలు, వరదల వల్ల పంట నష్టపోయిన 47 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీ సహాయం కూడా నేడు వారి ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సహాయాన్ని ఉపయోగించుకుని ప్రతి ఒక్క రైతు పంటలు వేయాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు అదే సీజన్లో నష్టం పరిహారం ఇచ్చిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. రెతులకు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అందించనంత ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి అందించినట్లు ఆయన కొనియాడారు. ఒంగోలు నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాల కాలంలో రైతుల సంక్షేమం కోసం అన్ని రకాలుగా ఆర్థిక సహాయాన్ని అందించిందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులు, అటవీ, దేవాదాయ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు రైతు భరోసా సహాయాన్ని అందించడం గొప్ప విషయమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి గోపీచంద్ అధికారులు పాల్గొన్నారు.

'ప్రకాశం'ను వెనకబడిన జిల్లాగా ప్రకటించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించి, జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల రూపాయలు ప్యాకేజీ ప్రకటించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరుబాట పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. ఈనెల 10 నుండి 23వ తేదీ వరకు 14 రోజులు పాటు 300 కిలోమీటర్లు సిపిఎం పోరాట బాట-పాదయాత్ర సాగుతుందన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో శుక్రవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఏర్పడి 53 ఏళ్ళు అయినా అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదన్నారు. జిల్లాను పాలకులు ఆశాస్త్రీయంగా విభజించడంతో కాస్తో, కూస్తో అభివృద్ధి చెందిన ప్రాంతాలు నెల్లూరు, బాపట్ల జిల్లాలకు వెళ్ళిపోయాయన్నారు. మిగిలిపోయిన జిల్లాలో ప్రాజెక్టులు పరిశ్రమలు, రవాణా మార్గాలు, విద్య, వైద్య రంగాలు నేటికి ఆశించిన రీతిలో అభివృద్ధి చెందలేదన్నారు. వెలుగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి 25 ఏళ్లు గడుస్తున్నా నేటికి పూర్తి చేయలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు పూర్తి చేయటంలో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. సిపిఎం పోరుబాట - పాదయాత్ర కార్యక్రమాన్ని ఈనెల 10న దోనకొండలో ప్రారంభించి సుంకేశుల, మార్కాపురం, తర్లపాడు, కనిగిరి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు మీదుగా ఈనెల 23 న ఒంగోలుకు చేరుకుంటుందన్నారు. 14 రోజుల పాటు 300 కిలోమీటర్లు పాదయాత్ర జరిగేలా రూట్ మ్యాప్ సిద్ధమైందన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధిని కాంక్షించే మేధావులు, ప్రజాతంత్రవాదులు, ప్రజలు, విద్యార్థులు, యువత భాగస్వాములై పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వెనుకబాటు తనానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీవి కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన తుమ్మల చెరువు గ్రామస్తులు

విశాలాంధ్ర-తర్లుపాడు : విద్యుత్ అధికారులు విద్యుత్‌ను సక్రమంగా గ్రామ ప్రజలకు సరఫరా చేయకపోవడంతో తుమ్మలచెరువు గ్రామ ప్రజలందరూ ఆగ్రహించి మూకుమ్మడిగా ఆ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇటీవల కొన్ని రోజుల నుండి గ్రామంలో విద్యుత్ సక్రమంగా అధికారులు అందించకపోవడంతో తాగునీటి సమస్యతో పాటు రాత్రిపూట నిద్రలు లేకపోవడం, పొలాల్లో సాగునీటికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంబంధిత విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారి నుండి ఎలాంటి స్పందన లేదని ఆందోళన చెందుతూ సబ్ స్టేషన్ వద్దకు గ్రామస్తులు చేరుకుని విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్య క్రమాలు చేపట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వారి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆందోళనలో అధిక సంఖ్యలో మహిళలు పురుషులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ 'జాబ్ మేళ'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

విశాలాంధ్ర-కంభం : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించేందుకు జగనన్న సారధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని గిద్దలూరు నియోజకవర్గ శాసన సభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. శుక్రవారం కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్కిల్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ఎమ్మెల్యే అన్నా ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ గతంలో యువత ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ ఆ కష్టాలను మన జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చూసి, ఆలకించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భావించారన్నారు. రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో స్కిల్ హబ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గిద్దలూరు నియోజక వర్గానికి కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసి, గత ఏడాది మెగా జాబ్ మేళా ద్వారా చాలా మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. స్కిల్ హబ్ లో శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ వారు సైతం ఇప్పటికే ఉద్యోగాలు పొందడం గర్వకారణమన్నారు. ప్రస్తుత జాబ్ మేళాకు 11 సుప్రసిద్ధ కంపెనీలు, సంస్థలు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ముందుకొచ్చాయన్నారు. ఈ మేళా ద్వారా గిద్దలూరు నియోజక వర్గ స్థాయిలో సుమారు వెయ్యి మంది యువతీ యువకులు ఉద్యోగాలు పొందే అవకాశం లభించిందన్నారు. స్కిల్ హబ్‌లో శిక్షణను విజవంతంగా పూర్తి చేసిన రెండవ బ్యాచ్ అభ్యర్థులకు ఎమ్మెల్యే అన్నా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవెలప్ మెంట్ అధికారులు, జిల్లా ఉపాధి కల్పనాధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కారు బైక్ ఢీ -వలంటీర్ మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలం బోయలపల్లి ఐటిఐ కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు మార్కాపురం నుండి యర్రగొండపాలెం వైపు వస్తున్న కారు యర్రగొండపాలెం నుండి బోయలపల్లి వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో యువకుడు అక్కడికక్కడే చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో జాతీయ రహదారి అంబులెన్స్ ద్వారా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. మృతుడు బోయలపల్లి గ్రామ వలంటీర్ ఐ.వెంకటేశ్వర్లుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్.ఐ జి.కోటయ్య, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ మహేష్‌కి ఘోర ప్రమాదం

సహాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు
వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహేష్

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తాతిరెడ్డి పల్లె గ్రామానికి చెందిన కొమరోలు మహేష్ మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డాడు. మహేష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో నంద్యాలలోని ఎస్ఐటీసీ వైద్యశాలకు తరలించారు. మహేష్‌కు మూడు సర్జరీలు చేయవలసి ఉంది. దాదాపు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. రోజువారి డ్రైవర్ పని చేసుకొని కాలం వెళ్లదీస్తున్న మహేష్ కుటుంబం అంత మొత్తం నగదు పెట్టుకునే పరిస్థితిలో లేదు. మహేష్‌కు సర్జరీలు చేయాలంటే తలా ఒక చేయి వేస్తే మహేష్ తిరిగి కోలుకునే అవకాశం ఉంది. దాతలు, ప్రజలు స్పందించాలని కోరుతున్నారు. దాతలు కొమరోలు గోపాల్ ఫోన్ పే నెంబర్ : 6304593108 నగదు వేయాలని కోరారు.

అన్నదమ్ముల ఘర్షణ

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : కుటుంబ కలహాల నేపథ్యంలో అన్నదమ్ములు ఇద్దరు అంబులతో ఒకరిపై ఒకరు అంబులతో దాడి చేసుకున్న సంఘటన మండలంలోని చిన్నారుట్ల గిరిజన గూడెంలో గురువారం రాత్రి జరిగింది. దోర్నాల మండలం చిన్నారుట్లలోని గిరిజన గూడెంలో అంబులతో అన్నదమ్ములు దాడులు చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో దాసరి పెద్ద ఈరన్న, అంకన్న అనే ఇద్దరు అన్నదమ్ములు ఒకరిపై ఒకరు అంబులతో దాడి చేసుకోగా తమ్ముడు అంకన్నకు తీవ్ర గాయం కావడంతో ఒంగోలుకు తరలించారు. సమాచారం అందిన వెంటనే దోర్నాల ఎస్సై అంకమ్మరావు సంఘటన స్థలానికి వెళ్లి, విచారించారు. గాయపడిన అన్న పెద్ద ఈరన్న సున్నిపెంట వైద్యశాలలో చికిత్స పొందు తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర-దర్శి : దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్ నగర్ లో యువకుడు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన శుక్రవారం తెల్ల వారు జామున చోటు చేసుకుంది. రేపూడి యేసు బాబు కు మోటు పల్లి కి చెందిన బాలమ్మ తో 22సంవత్సరాలు క్రితం వివాహం జరిగింది వీరికి ఇరువురు కుమార్తెలు, కుమారుడు కలరు. తన కుమార్తె సలోమికి ఇష్టం లేకుండా తన భార్య పెళ్లి చేసిందని, ఆ పెళ్ళికి తమ బంధువులు కూడా పిలవలేదని, తన భార్య తన దగ్గర ఉండకుండా పుట్టిల్లు మోటు పల్లిలో ఉండటంతో మన స్థాపనికి గురి అయ్యి ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడని ఎస్. ఐ రామ కృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

అరాచక,అవినీతి,సైకో పాలనకు చరమగీతం పాడాలి

టీడీపీ నేతల ధ్వజం

విశాలాంధ్ర-పామూరు : రాష్ట్రంలో అరాచక, అవినీతి, సైకో పాలనకు చరమగీతం పాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, కనిగిరి మాజీ శాసనసభ్యులు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం బోడవాడ సర్పంచ్ టిడిపిలో చేరుతున్న సందర్భంగా నాయకులకు స్వాగతం పలుకుతూ బోడవాడ అడ్డరోడ్డు నుండి అక్కంపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నూకసాని, ఉగ్ర మాట్లాడుతూ సైకో చేష్టలతో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. రాష్ట్రంలో దోపిడీ పాలన సాగుతుందని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం, పోలీసులు చేత అరెస్టులు చేయిం చడం, భయభ్రాంతులకు గురి చేస్తున్న వైసీపీ పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. వైసిపి పాలకులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన లోకేష్ బాబు పాదయాత్రకు ఊహించని విధముగా ప్రజలు నీరాజనం పలుకుతుండడంతో వైసిపి పాలకులులో భయం పట్టుకుందన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు చంద్రబాబు పాలనలో గుర్తింపు తప్పకుండా లభిస్తుంది అన్నారు. 2024 ఎన్నికల సమయం ఆసన్నమైందని, తప్పకుండా తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, ప్రతి కార్యకర్త మేనిఫెస్టో లోని సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించి తెలుగుదేశం పార్టీ గెలుపుకు సైనికులలా పని చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బోడవాడ పంచాయతీని దత్తత తీసుకొని మోడల్ గ్రామంగా తీర్చి దిద్దిన తర్వాతనే మరల ఓట్లు అడగడానికి వస్తానని డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ప్రకటించారు. బోడవాడ సర్పంచ్ దాసరి చిన్న మాల కొండయ్య, ఉప సర్పంచ్ రేగులగడ్డ లక్ష్మయ్యతో పాటు పలువురు వార్డు సభ్యులు తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి నూకసాని బాలాజీ, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పారిశ్రామికవేత్త కోట పాటి జనార్ధనలు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథ రామయ్య, లక్ష్మీ నర్సాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మోరబోయిన గంగరాజు యాదవ్, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, సయ్యద్ అమీర్ బాబు, హుస్సేన్ రావు యాదవ్, తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, ఇర్రి కోటిరెడ్డి, షేక్ కాజా రహమతుల్లా పాల్గొన్నారు.

ముమ్మరంగా గాలింపు చర్యలు

ఇంకా లభించని చిన్నారి ఆచూకి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని చింతల పాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అపహరణకు గురైన 16 నెలల చిన్నారి ఆచూకి కోసం పోలీసులు శుక్రవారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మైలారి సామ్యేల్ కెజియా దంపతుల కుమారుడు సాత్విక్ షాలోం బుధవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిద్రిస్తున్న సమయంలో చిన్నారి కన్పించని విషయం పాఠకులకు తెలిసిందే. గురు, శుక్రవారాల్లో పోలీసులు చిన్నారి ఆచూకీ కోసం బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినా ఇంకా ఆచూకి లభించలేదు. క్రైం ఏఎస్‌పి శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ ఆర్ రామరాజు, సీఐలు, ఎస్ఐలు శుక్రవారం చింతలపాలెం గ్రామంలోని సంఘటనా స్థలాన్ని సందర్శించి మరోసారి ఒంగోలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను తీసుకొచ్చి పరిశీలించారు. బాలుడు తల్లిదండ్రులు, నానామ్మ, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పామూరు, కనిగిరి, పొదిలి, త్రిపురాంతకం, కొండేపి, సీఐలు కె.శ్రీనివాసరావు, ఆళ్ల శివరామకృష్ణారెడ్డి, కె.రాఘవేంద్రరావు, పాపారావు, పాండు రంగారావు, సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల, గిద్దలూరు ఎస్ఐలు అనిల్ కుమార్, కె సురేష్, మహేష్, పిఐ మహేష్‌కుమార్, చింతలపాలెం పొలాలను, చిల్లచెట్లు పొదల్లో, బావులు తదితర చోట్ల గాలించినా డాగ్‌స్క్వాడ్ బృందం సంఘటనా స్థలాన్ని మరోమారు సందర్శించి పరిశీలించారు. తల్లి మంచంపై పడుకొని నిద్రిస్తున్న 16 నెలల చిన్నారి అపహరణకు గురి కావడం విస్తుగా ఉంది. బాలుడు కన్పించక పోవడంపై ప్రజలు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. ఎస్‌పి మలిక గర్గ్ పర్యవేక్షణలో క్రైం ఏఎస్‌పి శ్రీధర్‌రావు సీఎస్‌పురం పోలీసు స్టేషన్‌లో తిష్ట వేసి చిన్నారి ఆచూకి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీసు బృందాలకు ఎప్పటికప్పుడు పలు సూచనలు చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేసినట్లు కనిగిరి డీఎస్పీ ఆర్ రామరాజు తెలిపారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

వైసీపీ నాయకులు సానా రమణారెడ్డి

విశాలాంధ్ర-పామూరు : మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ఒమేగా విద్యాసంస్థల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కనిగిరి నియోజకవర్గ వైసిపి నాయకులు సానా రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజలకు కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరవలేనివని, ఆరోగ్యశ్రీ పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. రాజశేఖర్ రెడ్డి మరణం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీరని లోటు అన్నారు. శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైద్య శిబిరంలో అస్టర్ రమేష్ హాస్పిటల్ వైద్య బృందం ఒంగోలు వారి ఆధ్వర్యంలో రోగులను పరీక్షించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశమును పామూరు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగించుకోవాల్సిందిగా సానా రమణారెడ్డి పిలుపునిచ్చారు.

విదేశీ విద్యకు ఎంపికైన రాయవరం విద్యార్థి

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : విదేశీ విద్యకు మార్కాపురం మండలం రాయవరం సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దారా నవీన విదేశీ విద్యకు ఎంపికయ్యారు. రాష్ట్రంలో ఐదు మంది విద్యార్థులలో ఒకరు మార్కాపురం మండలం రాయవరం గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి ఉండటం మన ప్రాంత అదృష్టమని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు ఆదిమూలపు సురేష్, మార్కాపురం శాసనసభ్యులు నాగార్జునరెడ్డి విద్యార్థిని మార్కాపురంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఒక విద్యార్థికి లక్షన్నర నగదు, ఒక ట్యాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఐదు మంది విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు అన్ని ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆశాలత, సిబ్బంది కాశి అన్నపూర్ణ, సుచరిత, రంగయ్య పెద్దారవీడు మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, సుంకేసుల సర్పంచ్ గుద్దె పోగు రమేష్ ఉన్నారు.

నూతన వధువును ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల ఆంధ్రజ్యోతి పాత్రికేయులు చినారికట్ల గ్రామానికి చెందిన ఏలూరి రమణారెడ్డి కుమార్తె అలేఖ్య వివాహ కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శుక్రవారం హాజరయ్యారు. నూతన వధువు అయిన అలేఖ్యను ఆశీర్వదించారు. మీ వైవాహిక జీవితం సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణ, జడ్పీటిసి సభ్యుడు ఏడుకొండలు, మాజీ ఎంపీపీ రామనారాయణరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఎం శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచి ఉడుముల గురువారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టివినాయక విగ్రహాలనే పూజించాలి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రజలందరూ కాలుష్య కారకంగా ఉన్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడుకోవాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ ఎం.వెంకటేశ్వరరావు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణ సంస్థ చైర్మన్ జి.వీర భద్రాచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతే మహాగణ పతి అన్న ప్రచార గోడ పత్రికను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారం, స్వచ్ఛంద సంస్థల కృషితో కాలుష్య రహిత నగరంగా సాధించవచ్చునని అన్నారు. సంస్థ చైర్మన్ వీర భద్రాచారి మాట్లాడుతూ మా సంస్థ గత పన్నెండు ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ,కాలుష్య నివారణ కోసం అనేక ప్రజా అవగాహన కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు. ప్రజలందరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వీడి, మట్టి వినాయకులను పూజించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు పైనం మధు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జనసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర- మద్దిపాడు: ప్రముఖ సినీ నటుడు, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ 52వ జన్మదిన సందర్భంగా స్థానిక మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షులు నున్న బాలసుబ్రమణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ వారి సహకారంతో రక్తదాన శిబిరం, తదుపరి అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 3 గంటలకు ఒంగోలు నగరానికి చెందిన ఉపాస్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి డాక్టర్ల సూచన మేరకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షులు నున్న బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరడమైనది.

ఒంగోలులో సంతపేటలోని శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారి బృందావనంలో జరిగిన ఆరాధన ఉత్సవాల సందర్భంగా జరిగిన పూజా కార్య క్రమంలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి, కార్పొరేటర్ గోపి.

-విశాలాంధ్ర, ఒంగోలు

200 రోజులుగా అన్నదానం

పేదలకు అన్నం పెడుతున్న 'ఉగ్ర'

విశాలాంధ్ర-కనిగిరి : అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పది. అన్నార్తుల కోసమే అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేసి ఎంతో మంది పేదల ఆకలి తీరుస్తూ.. కనిగిరి నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్న మనసున్న మారాజు ఉగ్ర నరసింహారెడ్డి. నిరుపేదలకు 5రూపాయలకే నాణ్యమైన భోజనం, అల్పాహారం అందించే గొప్ప లక్ష్యంతో నాడు చంద్రబాబు ప్రభుత్వం అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తెస్తే... వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను తొలగించింది. కనిగిరిలో అన్న క్యాంటీన్‌ను అక్కసుతోనే తొలగించి... ఆ భవనంలో సచివాలయం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పేదలు వివిధ పనుల కోసం కనిగిరికి వచ్చే నియోజకవర్గ ప్రజలు, నిరుపేదలు పట్టెడన్నం కోసం పడుతున్న పాట్లును చూసి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చలించిపోయారు. అధినేత నారా చంద్రబాబునాయుడి పిలుపుతో కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో జనసీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కనిగిరిలోనూ "అన్న క్యాంటీన్ "ను తిరిగి ప్రారంభించారు. నాటి నుంచి 200రోజులు దిగ్విజయవంతంగా ముందుకు సాగుతోంది. కనిగిరి అమరావతి గ్రౌండ్స్ సొంత స్థలంలో 10 లక్షలు రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన "అన్న క్యాంటీన్‌లో ప్రతి రోజూ 500 మంది వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలతో నిత్యావసర ధరలు పెరిగినా కూడా పేదలు, సామాన్యులు ఇబ్బంది పడకుండా అన్న క్యాంటిన్ నిర్వహిస్తున్నారు. అన్న క్యాంటిన్ నిర్వహణలో ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పట్టుదల, దీక్షను చూసి పలువురు దాతలు కూడా తమ వంతు సాయం అందిస్తున్నారు. ముక్కు ఉగ్రనర సింహారెడ్డికి చేదోడుగా పలువురు దాతలు ముందుకొచ్చి వారి పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల సందర్భంగా అన్న క్యాంటిన్‌కు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. ప్రతిరోజు అన్న క్యాంటీన్ ద్వారా 500 మంది పేదలకు పట్టడం పెడుతూ వారి దీవెనలను అందుకున్న ఉగ్ర నరసింహారెడ్డి విజయుడే.

కడుపునిండా అన్నం తింటున్న పేదలు

పేదలకు కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్

కనిగిరికి పల్లెటూరి నుంచి తమ అవసరాలకోసం ఒకటి రెండు రోజులు వచ్చిన ఒక నిరుపేద, దిగువ మధ్యతరగతి రైతుని, ప్రజలకు, కూలీలకు ఉగ్రనరసింహారెడ్డి నిర్వహించే అన్న క్యాంటిన్ అక్షయ పాత్ర. కనిగిరి నియోజకవర్గం లోని వెలిగండ్ల హనుమంతునిపాడు, పెద్ద చెర్లోపల్లి ,చంద్రశేఖరపురం, పామూరు, కనిగిరి నుంచి కనిగిరి కి తమ కుటుంబ ఆరోగ్య అవసరాలకోసం వచ్చిన పేదింటి కుటుంబాలకు వాటాడు అన్నం పెడుతున్న ఉగ్ర కు జేజేలు పలుకుతున్నారు. ఉగ్ర ఆధ్వరంలో అన్న క్యాంటీన్ విజయ వంతంగా వర్ధిల్లాలని పేదలకు అన్నదానం చేస్తున్న అన్నా క్యాంటీన్ సుఖీభవ అంటూ ప్రజలు దీవిస్తున్నారు.

వైఎస్ఆర్ వర్ధంతిని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని విజయవంతం చేయాలని మండల సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం వైసిపి పార్టీ శ్రేణులను కోరారు. శుక్రవారం మండలంలోని వెలిగండ్లలో ఆయన మాట్లాడుతూ స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు శనివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రమైన వెలిగండ్లలో నిర్వహిస్తున్నందున పార్టీ కార్యకర్తలు అభిమానులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-కొమరోలు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు ఉపయోగించడం వల్ల వచ్చే అనర్థాలు వివరించి వాటికి దూరంగా ఉండాలని కళాశాల విద్యార్థిని విద్యార్థుల ఎస్ఐ సుబ్బరాజు తెలియజేయడం జరిగింది. కెరీర్ గైడెన్స్‌లో భాగంగా పోలీసు ఎస్సై వంటి ఉద్యోగ అవకాశాల పైన స్థానిక కొమరోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుబ్బరాజు చేత విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాక మాదకద్రవ్యాలను ఉపయోగించడం వల్ల వచ్చే అనర్థాలను వివరించి వాటికి దూరంగా ఉండండి అని ఎస్ఐ విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు కెరీర్ మెంటారుగా పనిచేసేటు వంటి అబ్బూరి అల్లూరయ్య, కళాశాల అధ్యాపకులు ఎస్ విజయ్ శంకర్, ఎస్ ప్రభాకర్, రవి నాయక్, సుజాత, లోకేష్, సుధాకర్‌రెడ్డి, జి ప్రభాకర్ అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాపా పిచ్చిరెడ్డి ఆదర్శనీయుడు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు దివంగత కాపా పిచ్చిరెడ్డి ప్రజా జీవితంలో ఆదర్శనీయుడని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. మండలంలోని జమ్మలమడక గ్రామంలో శుక్రవారం కాపా పిచ్చిరెడ్డి విగ్రహావిష్కరణ సభలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షునిగా పనిచేసిన కాపా పిచ్చిరెడ్డి రైతుల కోసం ప్రజల కోసం నిత్యం పలు సమస్యలను మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డితో పాటు తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే వారిని గుర్తు చేశారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే కార్యదీక్షకుడని కొనియాడారు. ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాపా పిచ్చిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాపా రమణారెడ్డి సుగుణ, కాపా నరసింహారెడ్డి, కాపా రాజశేఖర్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకల వెంకటేశ్వర రెడ్డి, జడ్పీటిసి తాతపూడి మోజేష్ రత్నం రాజు, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి, పసుపు గళ్ళు ఉపసర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి,, సోమేపల్లి సుబ్బయ్య, మేదరమెట్ల కోదండ రామయ్య, మాజీ సర్పంచ్ చింతా శ్రీనివాస్‌రెడ్డి, అబ్బనీ అంజిరెడ్డి, గాదె నాసర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల ధ్వజం

విశాలాంధ్ర -ఒంగోలు : జగన్ రెడ్డి ఎంత కక్షతో రగిలిపోతున్నాడో అయ్యన్న పాత్రుడి అరెస్టే నిదర్శనమని, అయ్యన్న అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని జగన్ రెడ్డి ప్రజాస్వామ్య మూలాలను ధ్వంసం చేస్తున్నాడని తెలుగుదేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. గన్నవరం సభలో అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యల్లో తప్పేముంది?60 మందిపై కేసులు పెడతారా? అధికార పార్టీ ఏం చేసినా చూస్తూ ఉండాలా? జగన్ రెడ్డికి పాలన చేతకాక టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి, అరెస్ట్‌లు చేయించి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ చంద్రబాబు, లోకేష్‌పై వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఊరకుక్కల్లా మొరుగుతున్నా వారిపై ఒక్క చర్యలు లేవన్నారు. మేము ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా? జగన్ రెడ్డి పాలనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విమర్శించడం నేరంగా మారిందన్నారు. ఎంత సేపూ ప్రశ్నించే వారిని వేధించడం, అణచివేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. వైసీపీ నేతలు ఏం చేసినా ప్రతిపక్షం నోరెత్తకుండా చేతులు కట్టుకొని వుండాలా? జగన్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయ పడ మన్నారు. వైసీపీ అరాచక పాలనపై పోరాటం ఆగదన్నారు. ఏదైనా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు. అయ్యన్న పాత్రుణ్ణి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నూతన పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-వెలిగండ్ల : నూతన పింఛన్లను వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు మండల సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం చేతుల మీదగా అందజేశారు. శనివారం మండలంలోని సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన వైయస్సార్ పెన్షన్ కానుకను అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని వారన్నారు.

టమాటా లారీ బోల్తా - రూ.లక్ష నష్టం

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పోలవరం వద్ద టమాటా లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే కడప నుండి టమాటా లోడుతో మార్టూరు వెళ్తుండగా మార్గమధ్యలో దర్శి అద్దంకి రహదారిలో పోలవరం వేంపాడు గ్రామాల మధ్య చేపల చెరువు మూల మలుపు వద్ద అదుపుతప్పి మార్జిన్‌లోకి వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లక్ష రూపాయలు మేరా టమాటాలు చెడిపోయాయి. అయితే చుట్టుపక్కల గ్రామాల ప్రజలతోపాటు ఆ రోడ్డు మార్గం వెళ్లేవారు కూడా పడిపోయిన టమాటాల కోసం ఎగబడి దోచుకుపోయారు. ప్లాస్టిక్ పెట్టెలను కూడా తీసుకువెళ్లారు.

సూర్యశ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఒంగోలు : సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో ఒంగోలు చంద్రయ్య నగర్‌లోని వినాయకుని గుడి పూజారి కొటారి శ్రీరామ్మూర్తి భార్య ఉషారాణి డెంగ్యూ జ్వరంతో మెదడు వాపు వచ్చి కాలు చేయి పడిపోయి కంటిచూపు మందగించి అనారోగ్యంతో బాధపడుతుంది. కుమారుడు పవన్ కుమార్ తల నరాలలో రక్తం గడ్డకట్టి మంచానికి పరిమితం అయ్యాడు. ఆ కుటుంబం పడుతున్న ఇబ్బందులను సూర్యశీ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భా షా దృష్టికి స్థానికులు తీసుకురావడంతో స్పందించి దాత ల సహకారంతో వైద్య ఖర్చులకు 48వ డివిజన్ కార్పొరేటర్ వేమూరి భవాని రూ .10వేలు, సునీత రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. హెచ్‌టు ఓ ఫౌండేషన్ అధినేత శ్రీలత కోరాడ సహ కారంతో మూడు నెలలకు సరిపడగా బియ్యం నిత్యవసర వస్తువులను మారెళ్ళ సుబ్బారావు వేమూరి మాలాద్రి ద్వారా ఆ కుటుంబానికి అందజేయడం అయినది. సందర్భంగా ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాషా మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పూజారి భార్య ఉషారాణి కుమారుడు పవన్ కుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాతలు ఆ పేద బ్రాహ్మణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారేళ్ళ సుబ్బారావు వైసీపీ జిల్లా నాయకులు వేమూరి మాల్యాద్రి . శ్రీదేవి, ట్రస్ట్ సభ్యులు నేరెళ్ల శ్రీనివాసరావు,మేడిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బి.రఘురాం

విశాలాంధ్ర -మద్దిపాడు: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని, మోదీ ప్రభుత్వానికి వైసిపి టిడిపి జనసేన మోకరిల్లుతున్నాయని ప్రజా సమస్యలను పక్కదోవ పట్టిస్తున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి రఘురాం అన్నారు. అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సిపిఎం సమరభేరి ప్రచార జాత మండలంలోకి ప్రవేశించింది. లింగంగుంట, ఏడు గుండ్లపాడు, ఇనమనమెల్లూరు, నందిపాడు, బసవన్నపాలెం, సీతారామపురం, మద్దిపాడు, ఘడియపుడి, వెల్లంపల్లి, కొలసనకోట, మల్లవరం, దొడ్డవరం, అన్నంగి, గుండ్లపల్లి గ్రామాల్లో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ గుండ్లకమ్మ గేటు కొట్టకపోయి నీరంతా సముద్రం పాలు అవుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. గేట్ల మరమ్మత్తులను త్వరగా పూర్తిచేయాలని, జమ్ము చిల్లచెట్లతో కూడిపోయిన కాలువలు మరమ్మతులు చేయాలని కోరారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలనీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బంక సుబ్బారావు, పూసపాటి వెంకటరావు, వి.బాలకోటయ్య, నియోజక వర్గ కమిటీ నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల వెంకటేశ్వర్లు, పల్లాపల్లి ఆంజనేయులు, పొత్తూరు సురేష్ బాబు, సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బ ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు వెంకటరామిరెడ్డి వెంకటేశ్వర్లు బూరగ శీను కాశీ, అనంతలక్ష్మి, జెడ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెదచెర్లోపల్లి బస్టాండ్ సెంటర్లో ద్విచక్ర వాహనాలపై ముగ్గురు వ్యక్తులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్లు ఎలాంటి వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి ఎస్సై కే.మాధవరావు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. అలాగే వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ కే.మాధవరావు తెలియజేశారు. ప్రయాణం చేసే సమయంలో వాహనానికి సంబంధించిన అనుమతి పత్రాలను ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలని వాహనదారులకు తెలియజేశారు. అలాగే తల్లిదండ్రులు చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించిన తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వామ్మో ఇదేం బాదుడు

సీపీఎం జిల్లా నాయకుడు తోట తిరుపతరావు

విశాలాంధ్ర-కంభం : విద్యుత్ బాదుడు ఆపాలి సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి. పెట్రోలు, డీజిల్ చార్జీలు తగ్గించాలి వ్యవసాయానికి, గృహాలకు, స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా నాయకుడు తోట తిరుపతరావు కోరారు. శుక్రవారం కంభం పట్టణంలోని కందులాపురంసెంటర్లో కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ అనంతరం కరెంటు బిల్లులు తగలబెట్టి నిరసన తెలియ జేయడం జరిగింది. పిమ్మట కందులాపురం సచివాలయ-2 అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు తోట తిరుపతిరావు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, లోని మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను ధరలను అదుపు చేయడంలో విఫలమైందన్నారు. అధికారానికి వచ్చింది మొదలు ప్రజావ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలుస్తూ పేదలపై పన్నులభారాన్ని మోపుతున్నది. రాష్ట్రాల హక్కులను హరిస్తున్నదని రోజురోజుకు నిత్యావసర ధరలు అదుపు లేకుండా పెరుగుతున్నాయి. నాడు 450 గా ఉన్న గ్యాస్ సిలిండర్ ధర 1200 రూపాయలకు పెరిగిందని పెట్రోల్ డీజిల్ చార్జీలు అంతులేకుండా పెరుగుతూనే ఉన్నాయని కాయగూరలు పప్పులు ధరలు ఊహించనంతగా పెరిగాయన్నారు. సామాన్య ప్రజలు వీటిని కొనలేక తినలేక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని చెబుతూ దొడ్డి దారిన కరెంటు చార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, ఆస్తి పన్ను,సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విపరీతమైన భారాలుమోపుతున్నది అసలు కంటే అదనపు చార్జీలు ఎక్కువగా ఉన్నాయి గృహాలకు, వ్యవసాయానికి ,స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నది దీనితో ఇటు వినియోగదారులు అటు రైతాంగం తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు.ఇప్పటికే పెరిగిన నిత్యావసర సరుకులు డీజిల్, పెట్రోల్ ,ధరలు పెరుగుదలతో రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులు నింపుతున్నది. ధరలు పెంచబోమని హామీని విస్మరించి సామాన్యులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు షాక్ ఇస్తున్నాయని గత సంవత్సరం 1400 కోట్ల రూపాయల భారం మోపిందని , స్లాబులు మార్చేశారు, గత పదేళ్ళ నుంచి వాడుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు చార్జీల పేరుతో జనం నెత్తిన 6000 వేల కోట్ల రూపాయల భారం వేయడం అన్యాయం అన్నారు. ఈ నాలుగేళ్లలో సుమారు 25 వేల కోట్ల రూపాయలు ప్రజల నెత్తిన మోపారని మొన్నటి వరకు రెండేళ్లకో, మూడేళ్లకో,కరెంటు చార్జీలు పెంచేవారు మోడీ ప్రభుత్వం ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ఇక ప్రతి నెల వంటగ్యాస్ లాగానే కరెంట్ చార్జీలు పెంచడానికి ఆదేశాలు ఇవ్వడం చాలా దారుణం అన్నారు. కరెంట్ బిల్లులే కాకుండా ఫిక్స్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు, ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నాయని,అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయని,దీనిని కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, రోశయ్య, షేక్ ఖాజావలి, కమిటీ సభ్యులు, షేక్ మహబూబ్ బాషా, భాష, ఎన్ అచ్చయ్య, ఉమయ్య, సంజీవయ్య, పలకరిక్షా యూనియన్ నాయకులు, సురేశ్, శ్రీను, వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ నాయకులు, ఎం పెద్దన్న, శ్రీను, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్, ఆవాజ్ కమిటీ కంభం మండల నాయకులు అస్లాం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

15లోపు పంటలు నమోదు చేసుకోవాలి



విశాలాంధ్ర-పెద్దారవీడు : సహాయ వ్యవసాయ సంచాలకులు మార్కాపురం వారి ఆధ్వర్యంలో శుక్రవారం సానికవరం రైతు భరోసా కేంద్ర పరిధిలో మండల వ్యవసాయ అధికారినితో కలిసి పంట నమోదు వివరాలను చెక్ చేయడం జరిగినది. ఇంకా పంట నమోదు ఎవరైనా రైతులు చేయించు కోకపోతే పంట వేయగానే పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మరియు ఈకేవైసీ చేయించుకుని ఫిజికల్ అక్నోలెడ్జిమెంట్ కూడా రైతులు అందరూ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పంట నమోదు చేయించుకోవడానికి సెప్టెంబర్ 15వ తారీకు ఆఖరిగా పరిగణించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి, మండల వ్యవసాయ అధికారిని కే. బుజ్జి బాయి, గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ప్రజలపై కపట ప్రేమ చూపుతున్న బీజేపీ

విశాలాంధ్ర-దర్శి : గ్యాస్ సిలిండర్ కు 2014 నుంచి ఇప్పటి వరకు రూ:750 రూపాయలు పెంచిన బిజెపి ప్రభుత్వం ఇప్పుడు 200 రూపాయలు తగ్గించటం తాటికాయ లాక్కొని ఈతకాయ చేతిలో పెట్టినట్టు ఉందని సిపిఐ (యం)దరిశి మండల కమిటీ సభ్యులు సందు వెంకటేశ్వరరావు ఎద్దేవా చేశారు.నిరుద్యోగం, అధికధరలపై దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా చౌటపాలెం రోడ్డులో సుందరయ్య భవన్ బజారు, కూటాల బజారుల్లో కరపత్రాలు ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ,గ్యాస్ సబ్సిడీ నేరుగా వినియోగదారుల ఖాతాల్లో వేస్తానని చెప్పిన నరేంద్రమోడీ మోడీ 8 ఏళ్లుగా సబ్సిడీ చేయకపోగా 2014 లో450 రూపాయలున్న సిలిండర్ 1200 రూపాయలకు పెంచి జనం నడ్డి విరిచారని విమర్శించారు.కందిపప్పు80నుంచి 120 కిపెంచారు.బియ్యం కేజీ 60 రూపాయలు అమ్ముతున్నారు అన్నారు.పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే బిజెపిని దానికి మద్దతిస్తున్న పార్టీలను ప్రజలు ఇంటికి పంపిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెవి పిచ్చయ్య,ఉప్పు నారాయణ తదితరులు పాల్గొన్నారు.